పంటలపై పందుల ప్రతాపం

- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- పంటల రక్షణకు నానా తంటాలు
- నష్టపరిహారం చెల్లించాలని వేడుకోలు



అడవి పందుల దాడిలో నేలవాలిన పంట



పందుల దాడిలో నష్టపోయిన పంటను చూపుతున్న రైతు

సిర్పూర్(టి): రైతులు సాగు చేసిన యాసంగి పంటలకు అడవి పందులతో తిప్పలు తప్పడం లేదు. మండలంలోని అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో అడవి పందుల బెడదతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలు చేతికందే సమయంలో రాత్రి సమయాల్లో ఒక్కసారిగా గుంపులుగా వచ్చి అడవి పందులు పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. మండలంలోని హీరాపూర్, లక్ష్మీపూర్, చీలపెల్లి, భూపాలపట్నం, వేంపల్లి తదితర గ్రామాలు అటవీప్రాంతాలకు ఆనుకొని ఉండటంతో ఆయా గ్రామాల శివారుల్లో ఉన్న పంట చేలల్లోకి అడవి పందులు వచ్చి నష్టం చేస్తున్నాయి.

రక్షణకు తంటా..

ఆయా గ్రామాల్లో రైతులు వేసుకున్న పంటలను అడవి పందుల బారి నుంచి కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. పంటలను రక్షించుకునేందుకు రైతులు పంట చేనుల్లో కాపలాగా ఉంటున్నప్పటికీ అడవి పందులు ఒక్కసారిగి గుంపులుగా వస్తుండటంతో ఏమి చేయలేకపోతున్నామని, పందుల దాడిలో పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా మండలంలోని హీరాపూర్ గ్రామ శివారులో ఉన్న పంట చేలల్లో అడవి పందులు స్వైర విహారం చేసి రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాయి. అడవి పందుల దాడి నుంచి పంటలను రక్షించుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కనెక్షన్లు పెట్టకూడదని అటవీశాఖ అధికారులు చెబుతుండటంతో రైతులు పంటలు రక్షించుకునేందుకు ఏమి చేయాలో తోచక అయోమయంలో ఉన్నారు. పంటల రక్షణకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చూపాలని రైతులు వేడుకుంటున్నారు. పంటలు తీవ్రంగ ధ్వంసమవుతుండడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని, అడవి పందుల దాడిలో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం..



మొక్కజొన్న పంట చేతికందే సమయంలో అడవి పందులు దాడి చేశాయి. దీంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రతీరోజు రాత్రి సమయాల్లో అడవి పందులతో పంటలను రక్షించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అయినా పంటలు కాపాడుకోలేక పోతున్నాం. చేతికందిన పంటలు నేలపాలవుతున్నాయి. – నన్న రాజేశ్, హీరాపూర్

పరిహారం చెల్లించాలి



అడవి పందుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి. సంబంధిత శాఖ అధికారులు నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. హీరాపూర్ శివారులో ఉన్న పంట చేనుల్లో అడవి పందుల దాడిలో పంటలు తీవ్రంగా నష్టపోయాం. – గాజిరెడ్డి సురేశ్, హీరాపూర్

నాణ్యమైన బొగ్గు అందించాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన: వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై అన్ని విభాగాల అధికారులతో శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గు నాణ్యతపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించాలని, నాణ్యత విషయంలో సంస్థ తీసుకుంటున్న చర్యలు, జాగ్రత్తలను ఉద్యోగులకు వివరించాలన్నారు. వినియోగదారుల నమ్మకంపైనే సింగరేణి సంస్థ మనుగడ ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఓసీపీ నుంచి సీహెచ్‌పీ వరకు బొగ్గు రవాణా చేసే విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ప్రాజెక్టు అధికారి నరేందర్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, క్వాలిటీ ఇంచార్జీ గుమాస రవి పాల్గొన్నారు.

గ్రూప్–2 విజేతకు సన్మానం



శివకృష్ణను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రూప్–2 ఫలితాల్లో విజేతగా నిలిచిన ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన శ్రీరామ్ శివకృష్ణను శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో 19వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 4వ ర్యాంకు సాధించిన శివకృష్ణ, గ్రూప్ 3 ఫలితాల్లోనూ రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంక్, జోనల్ స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ పిన్నా వివేక్, డాక్టర్ రూప్‌నార్ రమేశ్, శ్రీనివాస్, సుధాకర్, వెంకటేశం, మధు, నారాయణమూర్తి, ప్రమోద్, వినేశ్, బాబుగౌడ్, గణేశ్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

కోమటిగూడలో చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి: మండలంలోని కోమటిగూడ గ్రామంలో శనివారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీటీమ్స్, గంజాయి నివారణ, సీసీ కెమెరాల ఆవశ్యకత, బాల్య వివాహాలు, విద్యుత్ తీగలతో జంతువుల వేట వంటి అంశాలపై కళాజాత బృందం సభ్యులు ఆటపాటలతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ పెరుగుతున్న పరిజ్ఞానాన్ని అనుకూలంగా మార్చుకుని దుండగులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అలాగే నేరాల నియంత్రణలో భాగంగా గ్రామాల్లోనూ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన శిక్షలు వివరించారు. పొలాల్లో, అటవీ ప్రాంతాల్లో జంతువుల వే ట కోసం కరెంట్ వైర్లు అమర్చడం నేరమవుతుందన్నారు. గ్రామాల్లో ఎవరైన అనుమానిత, కొత్త వ్య క్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కళాబృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, శ్రీనివాస్, రజిత, సంఘవి తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి’



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరిస్తూ రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణ చేపట్టిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవ్‌రావ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాల వారి జీవితాలతో చెలగాటం ఆడితే రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ప్రస్తుత మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేశ్, పవన్, కిరణ్, ఇంద్ర, వర్మ, రాకేశ్, సాయి, శ్రావణ్, వంశీ పాల్గొన్నారు.

చేతిపంపు మరమ్మతు చేయరూ..!



కౌటాల: మండలంలోని వీరవెల్లి గ్రామం ఎస్సీకాలనీలో గల చేతిపంపు నిరుపయోగంగా ఉండడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో సక్రమంగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, గత కొద్ది రోజులుగా చేతిపంపు పనిచేయకపోవడంతో తిప్పలు తప్పడం లేదని వాపోయారు. చేతిపంపునకు మరమ్మతులు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చేతిపంపునకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రతీ నెల టీకాలు తీసుకోవాలి



వివరాలు పరిశీలిస్తున్న వైద్యుడు వినయ్ ఉప్రే

వాంకిడి: గర్భిణులు, పిల్లలు క్రమం తప్పకుండా రోగనిరోధక టీకాలు తీసుకోవాలని మండల వైద్యాధికారి వినయ్ ఉప్రే అన్నారు. శనివారం మండలంలోని సోయంగూడ గ్రామంలో టీకాల కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గర్భిణుల ఆరోగ్య పరీక్షలకు ప్రతీ నెల ఆసుపత్రికి రావాలని, కాన్పుకు వారం రోజుల ముందే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. ఎండలు అధికమవుతుండగా ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రాకపోవడమే మంచిదన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, సిబ్బంది పుష్ప, సారిక పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వర్కర్లు

ఆసిఫాబాద్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న వర్కర్లు సీపీఎం ఆధ్వర్యంలో చేస్తున్న ధర్నా శనివారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దినకర్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న వర్కర్ల వేతనాలు గత ఏడు నెలల నుంచి రాక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఎల్లప్పుడు సమస్యలపై పోరాటం చేస్తూ అండగా ఉంటుందన్నారు. ఆశ్రమ పాఠశాల వర్కర్లు రాము, పద్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

లింగాపూర్: వ్యవసాయ సాగు పనుల కోసం తమ భూముల్లో బోర్‌వెల్ తవ్వకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని రైతులు కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా లింగాపూర్ గ్రామానికి చెందిన పలువరు రైతులు మాట్లాడుతూ జాముల్‌ధరా శివారులోని తమ భూములను అటవీ భూములుగా పేర్కొంటూ వేసవి దుక్కులు దున్నకుండా అధికారులు ట్రాక్టర్ యజమానులకు నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్‌ను వినతిపత్రం ద్వారా కోరారు. వారంలో సర్వే పూర్తి చేసి సమస్య పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బలిరాం, గణపతి, బాపురావు, భీంరావ్, రాజేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టె.. దాహార్తికి చెక్ పెట్టె!



ఆసిఫాబాద్: ఎండలు మండుతున్నాయి.. వేసవి తాపానికి మూగజీవాలు అల్లాడుతున్నాయి. వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు జిల్లాకేంద్రంలోని కంచుకోటకు చెందిన రాపర్తి నరేశ్ వినూత్న ఆలోచన చేశాడు. మూగజీవాల కోసం తన ఇంటి ముందు నీటి తొట్టె ఏర్పాటు చేశాడు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు నీటి తొట్టె ఏర్పాటు చేసి పశువులు, పక్షుల దాహార్తి తీర్చాలని పేర్కొన్నాడు. స్థానిక మున్సిపాలిటీ అధికారులు ఆయా కాలనీల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని కోరాడు.

వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి



తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సిరికొండ: వేసవి కాలంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా తెలంగాణ సంస్కృతి సారధి కళాకారుల బృందం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని కోసుపటేల్ గూడలో శనివారం జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాబృందం గ్రామంలో ప్రజలకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలు, వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన చికిత్సపై అవగాహన కల్పించారు. కళాకారులు చాగటి రవి, రమేశ్ గుంజాల పాల్గొన్నారు.

నేడు బుద్ధవిగ్రహం ప్రతిష్టాపన

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుద్ధవిహార్‌లో ఆదివారం బుద్ధవిగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుద్ధిస్ట్ నాయకులు సోన్‌కాంబ్లె కృష్ణకుమార్, కిల్లరే అరుణ్, నర్వాడే రమేశ్, ధమ్మపాల్‌లు కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. బుద్ధవిహార్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బుద్ధవిగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందన్నారు. విగ్రహప్రతిష్ఠాపన అనంతరం అంబేడ్కర్ మనువడు భీంరావుయశ్వంత్‌రావు ముఖ్యఅతిథిగా రానున్నట్లు తెలిపారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామంలో శనివారం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి ఉపాధిహామీ పథకం నిధులతో మంజూరైన రూ.5లక్షల సీసీరోడ్డు, మురికి కాలువల పనులు ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, బాబన్న, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకన్న యాదవ్, దుస నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నవేగావ్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో లక్ష్మణ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవేగావ్‌లో 280 మంది ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా వాటిలో 87 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామంలో భూమిపూజ చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

18న దిన, వారసంత వేలం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని దిన, వార సంత, మేకల సంత 2025 సంవత్సరానికి గాను మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో గిరిజనులు మాత్రమే పాల్గొనాలన్నారు. ఇంటిపన్ను బకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనేందుకు అనర్హులని, అర్హులు రూ.50 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

‘విశ్వవిద్యాలయం పేరుమార్పు సరికాదు’

ఆసిఫాబాద్: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయంగా మార్పు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఒకరి పేరుతో ఉన్న విశ్వవిద్యాలయాన్ని మరొకరి పేరుపై మార్పు చేయడం ఆర్యవైశ్య సమాజాన్ని అవమాన పర్చడమేనన్నారు. సురవరం ప్రతాపరెడ్డి పేరును ఏదైనా కొత్త యూనివర్సిటీకి పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

కాగజ్‌నగర్‌రూరల్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా శనివారం బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలోని భట్‌పల్లి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. నియోజకవర్గ యూత్ కన్వీనర్ కాశిపాక రాజు, నాయకులు సీపీ రాజ్‌కుమార్, ట్రేడ్‌యూనియన్ అధ్యక్షుడు అంబాల ఓదెలు, మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల రాజ్‌కుమార్, అంజన్న, కన్నయ్య, హన్మంతు, శ్రీను, షాకీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాల్గోవ రోజుకు ఎమ్మార్పీఎస్ దీక్షలు

కైలాస్‌నగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాల్గోవ రోజుకు చేరాయి. నాయకులు సర్కారు తీరుకు వ్యతిరేకంగా తమ నిరసన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి మాదిగ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు.

బోథ్: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయబద్ధంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ బోథ్ మండల కేంద్రంలో చేస్తున్న నిరసన రిలే దీక్షలు శనివారం నాటికి నాల్గోవ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు బోథ్ మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులు సంఘీభావం ప్రకటించారు. దీక్షల్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, కారెం రవి, బిక్క రమణ, బత్తిని గంగయ్య తదితరులు ఉన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ పాఠశాలలో శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్ సింగ్, హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

క్రాంతినగర్ కాలనీలో ఇఫ్తార్



ఖర్జూర తినిపిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

కైలాస్‌నగర్: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్ కాలనీలో శనివారం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. నాయకులు ఇర్ఫాన్, ముబారక్, ఫరూక్, ఖయ్యూమ్‌రజా, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ ఏగం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఆర్, నలంద కళాశాలల వద్ద ప్రచారం చేపట్టారు. విద్యార్థులకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు నరేశ్, కునాల్, గజానంద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా: 9010608462

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

కొమురంభీం ఆసిఫాబాద్: తిరుపతి, ACO - 7997958206

సిర్పూర్ కాగజ్‌నగర్: కె.సాయికుమార్, S.R. - 7672055661

టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899